జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 86 ॥ శుక్రవారం ॥ 21-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

20 ఆగస్టు 2026 - గురువారంశ్రీ పరాభవ నామ సంవత్సరందక్షిణాయనం - వర్ష ఋతువుశ్రావణ మాసం - శుక్లపక్షంసూర్యోదయం - ఉ. 6:03సూర్యాస్తమయం - సా. 6:35తిథిఅష్టమి రా. 9:20 వరకుతరువాత నవమిసంస్కృత వారంబృహస్పతి వాసరఃనక్షత్రంవిశాఖ ఉ. 9:02 వరకుతరువాత అనురాధయోగంఇంద్ర తె. 4:15౦ వరకుకరణంవిష్టి ఉ. 8:16 వరకుబవ రా. 9:20 వరకువర్జ్యంమ. 1:35 నుండి మ. 3:22 వరకుదుర్ముహూర్తంఉ. 10:14 నుండి ఉ. 11:04 వరకుమ. 3:14 నుండి సా. 4:04 వరకురాహుకాలంమ. 1:53 నుండి మ. 3:27 వరకుయమగండంఉ. 6:03 నుండి ఉ. 7:37 వరకుగులికాకాలంఉ. 9:11 నుండి ఉ. 10:45 వరకుబ్రహ్మముహూర్తంతె. 4:27 నుండి తె. 5:15 వరకుఅమృత ఘడియలురా. 12:16 నుండి రా. 2:03 వరకుఅభిజిత్ ముహూర్తంఉ. 11:54 నుండి మ. 12:44 వరకుగమనిక: “౦” అనగా మరుసటి రోజున



# దక్షిణ మండలి సమావేశానికి చంద్రబాబు

## మహాబలిపురంలో కీలక భేటీ ప్రారంభం

### అమిత్ షా నేతృత్వంలో సమావేశం.. దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై చర్చ




కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో తమిళనాడులోని మహాబలిపురంలో నిర్వహిస్తున్న 31వ దక్షిణ మండలి సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం, అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పలువురు ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పుదుచ్చేరి ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, కేంద్ర-రాష్ట్ర సంబంధాల బలోపేతం వంటి అంశాలు ప్రధాన చర్చాంశాలుగా నిలవనున్నాయి. - మహాబలిపురం, ఆగస్టు 20 :

దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రవాణా అనుసంధానం, అంతర్రాష్ట్ర జల వనరుల వినియోగం, భద్రతా అంశాలు, పరిపాలనా సమన్వయం వంటి విషయాలపై విస్తృత చర్చ జరగనుంది. రాష్ట్రాలకు కేంద్రం నుంచి లభించాల్సిన నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులు, అభివృద్ధి కార్యక్రమాల అమలు పురోగతి వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రాధాన్యత పొందనున్నాయి. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించే అవకాశముందని సమాచారం. ముఖ్యంగా రాష్ట్ర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రోత్సాహం, కేంద్ర సహకారం అవసరమైన కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉందని భావిస్తున్నారు.



5

## విద్యా రంగంలో ఐదు కీలక బిల్లులు

శాసనమండలిలో ఏకగ్రీవ ఆమోదం

నారా లోకేశ్ ప్రవేశపెట్టిన బిల్లులు

ఉన్నత విద్య, గ్రంథాలయ రంగాల్లో సంస్కరణలు

నైపుణ్య విశ్వవిద్యాలయాలకు మార్గం సుగమం

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విద్యా రంగానికి సంబంధించిన ఐదు కీలక బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, సభ్యులందరి మద్దతుతో మండలి వాటిని ఆమోదించింది. విద్య, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సంస్కరణలను వేగవంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించినట్లు వెల్లడించింది.



## మోడల్ గ్రామంగా రామకృష్ణాపూర్

### పల్లె పల్లెలో ప్రజా పాలనకు విశేష స్పందన

### పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా వినతుల స్వీకరణ

హనుమకొండ, ఆగస్టు 20 :

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం రామకృష్ణాపూర్ గ్రామంలో నిర్వహించిన “పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన” కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

2

## కల్వకుర్తి కాల్వలను పరిశీలించిన జూపల్లి

### నీటి పొదుపుపై ప్రత్యేక ఆదేశాలు

- ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేయాలి
- ఆయకట్టు చివరి భూములకూ నీరు అందాలి
- అధికారులకు నిరంతర పర్యవేక్షణ సూచన



నాగర్‌కర్నూల్, ఆగస్టు 20 :

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ-8 కాల్వ పరిధిలోని పలు కాల్వలను మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. తూడుకుర్తి సమీపంలోని ప్రధాన కాల్వ నుంచి సాకర్‌పల్లి, ఏదుట్ల, గోపాలపేట, రేమద్దుల, సింగాయిపల్లి, తురకపల్లి, గోపులపురం ప్రాంతాలకు వెళ్లే కాల్వలను సందర్శించి నీటి (మిగతా 2వ పేజీలో)

## తెలంగాణలో రైల్వే అభివృద్ధిపై సమీక్ష



### దక్షిణ మధ్య రైల్వే ఎంపీల వార్షిక సమావేశం

### మౌలిక సదుపాయాల విస్తరణపై చర్చ

### ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యం

సికింద్రాబాద్, ఆగస్టు 20 :

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పార్లమెంట్ సభ్యుల వార్షిక సమావేశం గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమలవుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు.

2

## రాజీవ్ గాంధీ జయంతికి ఘన నివాళులు

### నిజామాబాద్‌లో విగ్రహానికి పూలమాలలు

### టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నివాళి

### కాంగ్రెస్ నాయకుల పాల్గొనడం.. రాజీవ్ సేవలను స్మరించిన నేతలు

నిజామాబాద్, ఆగస్టు 20 :

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని రాజీవ్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి అందించిన సేవలను ఈ సందర్భంగా (మిగతా 2వ పేజీలో)






## రాజ్యాధికారం దిశగా బీసీలు ఐక్యం కావాలి

### సామాజిక న్యాయం కోసం అడిగే స్థాయి నుంచి అధికారం సాధించే స్థాయికి ఎదగాలి: వట్టే జానయ్య యాదవ్

### ఆలె నరేంద్ర వర్ధంతి సభలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 20: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా బీసీలు ఇంకా తమ హక్కులు, వాటాల కోసం ఇతరులను వేడుకునే పరిస్థితిలో ఉండటం మంచిది కాదని, ఇకనైనా చైతన్యవంతులై రాజ్యాధికారమే లక్ష్యంగా సంఘటితం కావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. జనాభాలో అత్యధిక -2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

మేషం: పనులు ముందుకు సాగక నిరాశ చెందుతారు. వృథా ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి.

వృషభం: సంఘంలో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. చేపట్టిన పనులలో పురోగతి సాధిస్తారు. మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఇతరులకు సహాయం అందిస్తారు.

మిధునం: చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ముఖ్యమైన నిర్ణయాలలో తొందరపాటు నిర్ణయాలు ఇబ్బంది కలిగిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. దైవ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. సంతానం విద్యా విషయాలు అనుకూలిస్తాయి.

కర్కాటకం: చేపట్టిన పనులలో ప్రతిబంధకాలు తప్పవు. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. బంధు మిత్రులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

సింహం: ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగక చికాకులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. సోదరులతో కలహ సూచనలు ఉన్నవి. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొంత గందరగోళం ఉంటుంది.

కన్య: నూతన మిత్రుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలు విషయంలో ఉన్న ఆటంకాలు తొలగి, అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు అనుకూలిస్తాయి.

తుల: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు పరిష్కారమవుతాయి.

వృశ్చికం: వ్యయ ప్రయాసలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. బంధువులతో ఊహించిన వివాదాలు కలుగుతాయి. ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది తప్పదు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు కొంత మందగిస్తాయి.

ధనస్సు: ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహ పరుస్తాయి. దూర బంధువులతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. మిత్రులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

మకరం: నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విద్యార్థుల పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత ఉత్సాహవంతంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు పరిష్కారమవుతాయి.

కుంభం: ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృథా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయాలి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి.

మీనం: చేపట్టిన పనులను మరింత ఉత్సాహంగా పూర్తి చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.



# తెలంగాణలో రైల్వే అభివృద్ధిపై సమీక్ష

**సికింద్రాబాద్, ఆగస్టు 20 :**

సమావేశానికి వివిధ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, రైల్వే ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు, కొత్త రైల్వే మార్గాల విస్తరణ, ట్రాక్‌ల సామర్థ్య పెంపు, విద్యుదీకరణ పనులు, స్టేషన్ల ఆధునీకరణ కార్యక్రమాలపై అధికారులు వివరాలు అందించారు. పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. రైల్వే స్టేషన్ల పునర్వికాస పనుల పురోగతిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు మెరుగైన నిరీక్షణ మందిరాలు, పరిశుభ్రత, భద్రత, డిజిటల్ సదుపాయాలు, సులభ రాకపోకల కోసం చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. స్టేషన్లను ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ రైల్వే కార్యక్రమాలు, విద్యుత్ ఆదా చర్యలు, పునరుత్పాదక ఇంధన వినియోగం, హరితీకరణ కార్యక్రమాల అమలుపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దే కార్యాచరణపై ఎంపీలు సూచనలు చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైల్వే సామర్థ్య పెంపు, ప్రయాణికుల సౌకర్యాల విస్తరణ, భద్రతా ప్రమాణాల మెరుగుదల కోసం భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టుతు న్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి రైల్వే రంగం కీలకంగా మారేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## దక్షిణ మండలి సమావేశానికి భట్టి హాజరు

(మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతం గా అమలు చేయడం వంటి అంశాలపై చర్చించారు. తెలంగాణ తరఫున సమావేశానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. అభివృద్ధి, మౌలిక సదుపా యాలు, పరిపాలనా సమన్వయం వంటి విషయాలపై దక్షిణాది రాష్ట్రాల మధ్య మరింత సహకారం అవసరమని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, పరస్పర సమన్వయంతో అనేక సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కేంద్రం, రాష్ట్రాల మధ్య సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలనే అంశంపై కూడా చర్చ జరిగింది.

# మక్తల్ అభివృద్ధికి రూ.273 కోట్ల పనులు

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రహదారులు, ఆసుపత్రులు, క్రీడా మైదానాలు, విద్యాసంస్థలు, సాగునీరు, విద్యుత్, గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ 2001 ఆగస్టు 20న తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల అండదండలతో 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. మక్తల్ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వానికి, తన ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. మక్తల్ చాలా కాలం వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయిందని, ప్రస్తుతం కొడంగల్‌కు సమానంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే రెండున్నరేళ్లలో ప్రతి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మక్తల్ నియోజకవర్గంలోని రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు శ్రీహరి వివరించారు. రైతు రుణమాఫీ కింద 33,788 మంది రైతులకు రూ.363 కోట్లు, రైతు భరోసా కింద 92,949 మంది రైతులకు రూ.153.52 కోట్లు అందించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రెండు దశల్లో 5,500 ఇళ్లకు రూ.275 కోట్ల మేర ప్రయోజనం కల్పిస్తున్నామని, 3,942 కుటుంబాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా రూ.39.46 కోట్ల సాయం అందించినట్లు చెప్పారు. గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి గ్యాస్ పథకం, కొత్త రేషన్ కార్డులు, సన్న వడ్ల కొనుగోలు, బోనస్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా పెద్దఎత్తున నిధులు కేటాయించామని మంత్రి తెలిపారు. 49 గ్రామ పంచాయతీ భవనాలకు రూ.9.80 కోట్లు, 24 అంగన్‌వాడీ భవనాలకు రూ.2.88 కోట్లు, 72 మహిళా సంఘ భవనాలకు రూ.7.20 కోట్లు కేటాయించినట్లు వివరించారు. విద్యుత్ మౌలిక వసతుల బలోపేతంలో భాగంగా 33 కేవీ సబ్‌స్టేషన్లు, 132 కేవీ, 220 కేవీ వ్యవస్థల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. ఆత్మకూరు, అమరచింత, ఉట్కూర్, నర్వ, కృష్ణ, మాగనూర్, మక్తల్ మండలాల్లో ఆసుపత్రులు, రహదారులు, క్రీడా మైదానాలు, విద్యాసంస్థలు, లిఫ్ట్ ఇరిగేషన్, వంతెనలు, గోదాములు, పట్టణ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మక్తల్‌లో 150 పడకల ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం, అగ్నిమాపక కేంద్రం, సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం, డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాల వంటి కీలక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ వాకిటి శ్రీహరి 25 ఏళ్లుగా ప్రజల కోసం కష్టపడుతూ ఈ స్థాయికి ఎదిగారని, ఆయన రాజకీయ ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. మక్తల్ అభివృద్ధికి సుమారు రూ.1,800 కోట్ల మేర నిధులు తీసుకురావడానికి శ్రీహరి కృషి చేశారని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతి రోజునే ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభం కావడం విశేషమని, గ్రామ పంచాయతీల బలోపేతానికి రాజీవ్ గాంధీ చేసిన కృషిని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వెనుకబడిన నియోజకవర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మక్తల్ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సీతక్క పిలుపునిచ్చారు.

# మంత్రి సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రిపై తీవ్ర స్థాయిలో చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. బుధవారం దిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం గురువారం లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. దిల్లీలో ఉన్నప్పుడే కొందరు ముఖ్యనాయకులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రితోనూ, మరికొందరు మంత్రులతోనూ మాట్లాడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ బుధవారం మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలినని గురువారం సమాచారం ఇచ్చారు. ఇదే సమయంలో మంత్రి మాజీ ఓఎస్‌డీ సుమంత్‌పై గురువారం కేసు నమోదైంది. ఓ వ్యాపారిని బెదిరించి దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో ఈ కేసును పోలీసులు నమోదు చేశారు. గతంలో ఓ వివాదంలో ఇతనిని అరెస్టు చేయడానికి ప్రయత్నించినపుడు కూడా కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఆ సమయంలో పార్టీలోని కొందరి జోక్యంతో పరిస్థితి సద్దుమణిగినా, తాజా పరిణామాల్లో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఇలాంటి వ్యవహారాల్లో ఆచితూచి అడుగేయాలనే అభిప్రాయం కూడా పార్టీలో కొందరు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తమ్మీద ఈ వ్యవహారం రానున్న రోజుల్లో మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

**సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తాం**

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: "వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయం అని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆమె మాటలపై వివరణ ఇవ్వాలని మంత్రి కొండా సురేఖకు ఇప్పటికే పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. మంత్రి వివరణను పరిశీలించాక ఏం చేయాలో ఆలోచిస్తాం" అని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. నిజామాబాద్‌లో గురువారం నిర్వహించిన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... "పార్టీకి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎవరికి వారు పలానా స్థానం నుంచి పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదు. టికెట్లు ఇవ్వడంలో సీడబ్ల్యూసీ, అధిష్ఠానానిదే తుది నిర్ణయం. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వంపై ఎందుకు వ్యాఖ్యలు చేశారు? ఆయన ఆవేదన ఏమిటి? అనేది అర్థం చేసుకున్నాం. ఆ నియోజకవర్గంలోని కొత్త, పాత నేతలను సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం. నిషేధిత భూములకు సంబంధించిన 22ఏ పై భారాస అనవసర రాద్ధాంతం చేస్తోంది. కిందిస్థాయిలో జరిగిన తప్పులను సరిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు" అని వివరించారు.

# మోడల్ గ్రామంగా రామకృష్ణాపూర్

**హనుమకొండ, ఆగస్టు 20 :**

గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 50 మందికి రూ.14.97 లక్షల పెన్షన్లు అందుతున్నాయని తెలిపారు. మొదటి దశలో రెండు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వాటి నిర్మాణం పూర్తయిందని, రెండో దశలో మరిన్ని అర్హ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. 52 కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని, 65 కుటుంబాలకు గ్యాస్ సబ్సిడీ అందించినట్లు వివరించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మంత్రి వివరించారు. గ్రామంలోని 610 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.55.89 లక్షలు అందించగా, రైతు భీమా కింద ఇద్దరు రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సాయం అందించినట్లు చెప్పారు. రైతు రుణమాఫీ, సన్న వడ్ల బోనస్ వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక ఊరట కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. హనుమాన్ ఆలయం, పోచమ్మ ఆలయం అభివృద్ధి, అంతర్గత సీసీ రోడ్లు, వాటర్ ప్లాంట్, కమ్యూనిటీ హాల్, తిమ్మాపూర్ రహదారి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలు ఇకపై రేషన్ సరుకుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్టీల్ బ్యాంకుల వినియోగాన్ని విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు అవసరమైన స్టీల్






సామగ్రి అందజేస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నామని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం కింద గ్రామంలోని పలువురు లబ్ధిదారులు సోలార్ విద్యుత్ సదుపాయం పొందుతున్నారని మంత్రి పేర్కొన్నారు. భూగర్భ జలాల సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. చిన్న గ్రామమైన రామకృష్ణాపూర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## రాజీవ్ జయంతికి ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు స్మరించుకున్నారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సాంకేతిక రంగం, సమాచార విప్లవానికి పునాదులు వేసిన నాయకుడిగా రాజీవ్ గాంధీని కొనియాడారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశ యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ దూరదృష్టి కలిగిన నాయకుడని అన్నారు. దేశాన్ని ఆధునికీకరణ దిశగా నడిపించిన ఆయన ఆలోచనలు ఇప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కూడా రాజీవ్ గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజాస్వామ్య బలోపేతం, గ్రామీణాభివృద్ధి, సాంకేతిక పురోగతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు రాజీవ్ గాంధీ జీవిత విశేషాలను ప్రస్తావిస్తూ దేశ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ నివాళి కార్యక్రమం గౌరవప్రద వాతావరణంలో సాగింది. కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

## కల్వకుర్తి కాల్వలను పరిశీలించిన జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

ప్రవాహం, కాల్వల పరిస్థితిని పరిశీలించారు. సాగునీటి సరఫరా పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, నీటి వృథాను పూర్తిగా నివారించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా అధిక విస్తీర్ణంలో పంటలకు సాగునీరు అందించవచ్చని అన్నారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల ద్వారా విడుదలవుతున్న నీటి ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడైనా లీకేజీలు, నీటి వృథా, సరఫరా అంతరాయాలు ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు.

శ్వేత

సంపాదకీయం

శుక్రవారం 21-8-2026

# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?

దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ధరలతో సామాన్యులు అల్లాడి పోతున్నారు. అయినా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ధరల కట్టడికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఈ వ్యవహారం తమ పరిధిలో లేదన్నరీతిలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. సొంత ఎజెండాలను ముందుకేసుకుని నడుస్తున్నాయి. ప్రజలు ఏమయితేనేమి అన్న భావనలో పాలకుల తీరు ఉంది. ఎన్నికలప్పుడు మేనేజ్ చేయడం నేర్చుకున్న వారు ఆ తరవాత ప్రజలను పట్టించుకోవడం లేదు. ఎదుటి పార్టీలను బురిడీ కొట్టించడం, నానాయాగీ చేయడం తప్ప పాలన కట్టుతప్పి పోతోంది. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఫైన్ రైస్ కిలో బియ్యం ధర 80 రూపాయలకు చేరింది. ఈ ధరలు మరింత పెరుగుతాయని, వందకు చేరుకుంటుందని అంటున్నారు. ఎల్‌నినోతో ఉత్పత్తి తగ్గిందన్న సాకుతో ధరలు పెంచేశారు. అలాగే ఉప్పులు పప్పులు, నూనెల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. మందుల ధరలు కూడా గుట్టుచప్పుడు కాకుండా పెంచేస్తున్నారు. ఇవన్నీ ఎవరి పరిధిలో ఉందో ప్రజలకు తెలియడం లేదు. ఇక కూరగాయల ధరలు కూడా 60 నుంచి వంద వరకు పలుకుతున్నాయి. అయితే ఎపిలో సబ్సిడీ బియ్యం పథకం ప్రారంభించారు. ఇది పెద్దగా ప్రజామోదం పొందలేదు. పాలకులు సొంత ఎజెండాతో, పార్టీ పరంగా విమర్శలు, ప్రతి విమర్శలతో బిజీగా ఉన్నారు. ఎపిలో అప్పుడే ఎన్నికలు వచ్చాయా అన్న రీతిలో వైకాపా, టిడిపి కూటమి పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ నడుస్తున్నా అందులో ధరలపై ఎజెండా లేదు. తెలంగాణలో 22ఎ వ్యవహారం ముదిరింది. ప్రజలను రోడ్డుకీడ్చిన రేవంత్ సర్కార్ వారి నుంచి భూములను లాక్కునే ప్రయత్నంలో ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. మంత్రులంతా వసూళ్లలో పడ్డారని, 30 శాతం కమిషన్ ప్రభుత్వం అని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. బిఆర్ఎస్‌ను విమర్శించడంలో కాంగ్రెస్ బిజీగా ఉంది.

ఇక బిజెపి వందేమాతరం, డీలిమిటేషన్, కొత్త కార్యవర్గం కూర్పుతో బిజీగా ఉంది. కాంగ్రెస్ పార్టీ బిజెపిని విమర్శించడం, యువతకు క్షమాపణలు చెప్పండి అన్న పనిలో పడింది. మొత్తంగా దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలన్నీ సొంద ఎజెండాతో నడుస్తున్నాయి. అందువల్ల ధరల దాడి వాటికి పట్టడం లేదు. బిజెపి అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా ఈ వ్యవహారాలను చూడడం లేదు. పార్టీలో కొత్త కార్యవర్గం, రానున్న పలు రాష్ట్రాల ఎన్నికలతో తలమునకలుగా ఉంది. తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో మళ్లీ రామ్ మాధవ్‌కు చోటు కల్పించారు.దాదాపు ఆరు సంవత్సరాలుగా బీజేపీకి దూరంగా ఉన్న సిద్ధాంతకర్త రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించగా,14 మంది ఉపాధ్యక్షుల్లో 11 మంది, 18 మంది ప్రధాన కార్యదర్శుల్లో 11 మందికి 'సంఘ్' వాసనలు ఉన్నాయని అంటున్నారు. ఎలాంటి సమాచారాన్ని అయినా సత్వరం ప్రచారం చేయగల, ప్రత్యర్థులపై శక్తి సామర్థ్యాలున్న ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయను 11సంవత్సరాల తర్వాత ఆ పదవి నుంచి తొలగించడం, దుందుడుకు భాషను ప్రయోగించే తేజస్వి సూర్యలాంటి వారిని తప్పించడం వంటివి జరిగాయి.

ఒకప్పుడు వెంకయ్య, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్ తదితర దిగ్గజ నేతలతో అలరారిన పార్టీ ఇప్పుడు పేలవంగా తయార వుతోంది. నితీన్ నబీ అధ్యక్షుడు అయ్యాక పార్టీ పెద్దగా ప్రభావశీలంగా కనిపించడం లేదు. గడచిన 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు చెప్పుకోవడానికి ఎప్పుడూ మోడీ ముందుంటారు. అయితే అందులో ధరలు తగ్గించగలిగామని ఎప్పుడూ చెప్పలేదు. ధరలపై సమీక్షకు పెద్దగా సమయం కేటాయించ లేదు. తాజాగా ఇప్పుడు దిమాగీ నక్సల్స్ మాటతో మళ్లీ కొత్త చర్చ లేపారు. అయితే మోదీ ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదు. 12 ఏళ్లు నిరాఘాటంగా పాలించిన అనుభవంతో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పెద్దగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కేవలం ఎన్నికలు, గెలుపు అన్న ధోరణిలో పాలన సాగిస్తున్నారు. ఈ క్రమంలో పరిశీలిస్తే పాలక పార్టీలు ఏవీ కూడా ధరల గురించి మాట్లాడడం లేదు. 80కి కిలో బియ్యం కొనడమెలా ఆలోచించడం లేదు. జివిఎస్టీ వసూళ్లు పెరుగుతున్నాయా లేదా అన్నది చూసుకుంటూ మురిసిపోతున్నారు. ప్రజల విషయంలో ఇప్పటికైనా ఆలోచన చేయాలి. ధరల పెరుగుదలను అరికట్టడమెలా అన్నదానిపై దృష్టి సారించాలి. లేకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యంగా మార్కెట్ మారిపోవడం ఖాయం.

# వందేమాతరంపై రాజకీయ వివాదం

## కాంగ్రెస్ తీరును ఎండగట్టిన బిజెపి.. కొత్త ముస్లింలీగ్ పార్టీ అంటూ నితిని నబీన్ విమర్శలు



న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): జాతీయ గేయం 'వందే మాతరం' విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న తమ 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. మరోవైపు కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నిర్ణయం ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆరోపించింది. వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించిన కాంగ్రెస్‌పై భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. ఓట్ల కోసం కాంగ్రెస్ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో తీవ్రస్థాయిలో స్పందించారు. వందేమాతరాన్ని అవమానించడం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. ఇకపై పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో చోటుచేసుకున్న వివాదాన్ని నబీన్ పరోక్షంగా ప్రస్తావించారు. వందేమాతరంపై తన వైఖరిని కాంగ్రెస్ తీర్మానం రూపంలో అధికారికం చేసిందన్నారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ సమర్థన కాదని, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది మాట్లాడుతూ.. వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పుడు జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం, పార్లమెంట్, దేశం కంటే పార్టీ నిర్ణయానికే కాంగ్రెస్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ తీరు చారిత్రక ముస్లిం లీగ్ వైఖరిని గుర్తుకు తెస్తోందని, ఆ పార్టీ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని ఆరోపించారు. 1931లో వందే మాతరం పూర్తి రూపంపై ముస్లిం లీగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ నిర్ణయం కూడా అదే తరహా మొండితనాన్ని ప్రతిబింబిస్తోందని బీజేపీ విమర్శించింది.

## పీఎం రాహత్ కింద ప్రమాద బాధితులకు అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులు వైద్య సహాయం అందించాల్సిందే

### నగదు రహిత వైద్య సేవలను తిరస్కరించకూడదు: డా.జి.లక్ష్మీశ

విజయవాడ: ఆగస్టు 20, 2026.: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు పీఎం రాహత్ పథకం కింద నగదు రహిత అత్యవసర వైద్య సేవలు అందించడం నెట్‌వర్క్ ఆసుపత్రుల బాధ్యతని, చికిత్స అందించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించకూడదని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం జిల్లాలోని 51 నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులకు నిర్వహించిన పీఎం రాహత్ పథకం అవగాహన, శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద బాధితులకు వెంటనే నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2026 ఫిబ్రవరి 13న పీఎం రాహత్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద ప్రతి ప్రమాద బాధితుడికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్స, ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల వరకు అందే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి అత్యవసర వైద్య సేవలు అందించడమే పథకం ప్రధాన ఉద్దేశమని, డబ్బు లేకపోవడం వల్ల చికిత్స ఆలస్యం కావడం లేదా ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి రాకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులు పథకం నిబంధనల ప్రకారం ప్రమాద బాధితులకు పూర్తి బాధ్యతతో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. పథకం పరిధిలోకి వచ్చే చికిత్సకు సంబంధించి బాధితుల నుంచి నగదు కోరడం లేదా సేవలను నిరాకరించడం చేయకూడదని స్పష్టం చేశారు. పథకం అమలుపై ఆసుపత్రుల ప్రతినిధులతో పాటు ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రమాద బాధితులను వీలైనంత త్వరగా సమీపంలోని అర్హత కలిగిన నెట్‌వర్క్ ఆసుపత్రికి తరలించి, తక్షణ వైద్య సహాయం అందేలా ప్రజలు సహకరించాలని కోరారు.



## భారీగా పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు భారీ పెరుగుదల నమోదు చేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై మార్కెట్ అంచనాలు కూడా బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,270గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.4300 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,46,000గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.3950 మేర పెరిగింది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలోకు రూ.10 వేల మేర పెరుగుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది.

## పాకిస్థాన్‌లో దారుణ ఘటన

### యూట్యూబర్ ను కాల్చి చంపిన దుండుగులు

లాహోర్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ):పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ టిక్‌టాకర్, యూట్యూబర్ షమ్సా బీబీ దారుణ హత్యకు గురయ్యారు. 28 ఏళ్ల ఈ యువతికి టిక్‌టాక్‌లో 1.3 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఆగస్టు 14న టాక్సిలా నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. షమ్సా తన సోదరుడు, సోదరితో కలిసి కారులో వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కాల్పులు జరిపారు. మృతురాలి తండ్రి ఫజల్ సాహిబ్‌జాదా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. కాశిఫ్ అనే వ్యక్తి షమ్సాకు ఫోన్ చేసి

ఇంటి నుంచి బయటకు రావాలని చెప్పాడు. దీంతో ఆమె తన చెల్లి, తమ్ముడితో కలిసి కారులో బయటకు వచ్చారు. కాసేపటికే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి షమ్సా ప్రయాణిస్తున్న కారును అడ్డగించారు. ఆ వెంటనే తుపాకీతో కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో షమ్సా బీబీ మెడలోకి బు÷-లలెట్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే ప్రమాదంలో షమ్సా బీబీ సోదరి అసీమా కూడా తీవ్రంగా గాయపడింది. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి.

ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ఇంకా పరారీలో ఉన్నారు. అయితే నిందితులకు షమ్సాబీబీకి సంబంధించిన సమాచారం అందించినట్లు అనుమానిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. హత్యపై రావల్పిండి పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. షమ్సా బీబీ హత్యకు ఆమె నిర్వహిస్తున్న సోషల్ మీడియా కార్యకలాపాలు కారణం కాదని, ఆర్థిక వివాదమే కారణమై ఉండొచ్చని ఆమె కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కౌసర్, జావేద్ అలియాస్ షాహీన్‌తో షమ్సాకు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని తండ్రి పోలీసులకు తెలిపారు. 2026 మార్చిలో టిక్‌టాక్ క్రియేటర్ సనా జావేద్ అనే యువతి కూడా ఇస్లామాబాద్‌లో ఇదే తరహాలో హత్యకు గురయ్యారు.

## మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

ముంబై,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ):ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత ఆమె కడుపులోనే గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ వదిలేసి కుట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపునొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. వద్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఆగస్టు 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా ఆస్పత్రిలో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. మహిళ ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన స్కానింగ్‌లో ఆమె కడుపులో ఏవో వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. రిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పుణెలోని సాసూన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి, ఆమె కడుపులో ఉన్న గ్లౌజులు, పేపర్ వైప్స్ ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. తన భార్య పరిస్థితికి మొదటి ఆపరేషన్‌లో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సంధ్య భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.




# యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

**ప్రతి విషయంలోనూ అత్యంత జాగ్రత్తగా ఉండాలి**

**అలసత్వానికి తావులేకుండా విధులు నిర్వర్తించండి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలు**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని.. ఈ నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ యూపీఎస్సీ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఎన్.రాజేశ్వరరావుతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో సివిల్స్ మెయిన్స్‌పై ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. కస్టోడియన్, లైజనింగ్ అధికారులతో పాటు వెన్యూ సూపర్వైజర్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, పోస్టల్, ప్రజా రవాణా, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనగా పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 124 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21న పేపర్-1 ఎస్సే, 22న జీఎస్-1, జీఎస్-2, 23న జీఎస్-3, జీఎస్-4, 29న భారతీయ భాష, ఇంగ్లిష్, 30వ తేదీన ఆప్షనల్ సబ్జెక్టులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని.. బందోబస్తు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరం తదితరాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూపీఎస్సీ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా అభ్యర్థుల ముఖ ఆధారిత గుర్తింపు ప్రక్రియ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా వివిధ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రానికి బస్సులను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజారవాణా శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విజయవాడ నగరంలో పార్కులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**పర్యాటక ప్రాంతాలను ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



విజయవాడ: ఆగస్టు 20,2026. విజయవాడ నగరంలోని పార్కులు, పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు వాటిని ఆదాయ వనరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు.

విజయవాడ కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధ్యక్షతన టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలు, నగరంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు వినోదాన్ని అందించే కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. విజయవాడ నగరంలోని పార్కులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించాలని కలెక్టర్ సూచించారు. పార్కులలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, వాటిని సమర్థవంతంగా వినియోగించుకుని ఆదాయ వనరులుగా మార్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బెరం పార్క్, భవానీ ఐలాండ్, ఫెర్రీ ఘాట్ తదితర పర్యాటక ప్రాంతాల్లో ప్రతి శని, ఆదివారాల్లో ప్రజలను ఆకర్షించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాత్మక కార్యక్రమాలు తదితరాలను నిర్వహించడం ద్వారా నగర ప్రజలతో పాటు పర్యాటకులను కూడా ఈ ప్రాంతాల వైపు ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయవాడ నగరంలోని మ్యూజియం, మొగల్రాజపురంలోని గృహాలు తదితర చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రాంతాల ప్రాధాన్యతను తెలియజేసే సమాచారాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు పర్యాటకులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సింగ్‌నగర్‌లో సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సిబార్ డిస్నీల్యాండ్ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని నగర ప్రజలకు వినోదం, ఆహ్లాదాన్ని అందించే ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. విజయవాడ నగర ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి తమ ఖాళీ సమయాన్ని ఆనందంగా గడిపేలా పర్యాటక, వినోద ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. నగరంలోని పర్యాటక ప్రదేశాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, పర్యాటకుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు మరియు టూరిజం కౌన్సిల్ సభ్యులు సమన్వయంతో పనిచేసి విజయవాడ నగరాన్ని మరింత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రతిపాదిత అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, జిల్లా టూరిజం అధికారి కొల్లేటి రమేష్, టూరిజం కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## శిశు గృహ సంరక్షణలో ఉన్న బాలుడిని చట్టబద్ధంగా దత్తత

**దత్తత ప్రక్రియలో అన్ని నిబంధనలు, పత్రాలను పరిశీలన.. కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**


విజయవాడ: ఆగస్టు 20,2026., ఎన్టీఆర్ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక దత్తత సంస్థ శిశు గృహంలో సంరక్షణలో ఉన్న బాలుడిని గురువారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో చట్టబద్ధంగా దత్తతు ప్రక్రియను చేపట్టడం జరిగింది. దత్తత ప్రక్రియలో భాగంగా బాలుడి గుర్తింపుకు సంబంధించిన వివరాలు, దత్తత తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, సంబంధిత ధ్రువపత్రాలు, పత్రికా ప్రకటన, ఇతర అవసరమైన రికార్డులను పరిశీలించారు. దత్తత ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. బాలుడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, ఇప్పటివరకు నిర్వహించిన వైద్య పరీక్షలు, ఆరోగ్య రికార్డుల గురించి జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాలుడి ఆరోగ్యానికి సంబంధించిన అన్ని వివరాలను దత్తత తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. దత్తత తీసుకుంటున్న తల్లిదండ్రులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడి, బాలుడిని ప్రేమతో, బాధ్యతతో పెంచాలని సూచించారు. బాలుడి ఆరోగ్యం, పోషణ, విద్య, భద్రత, సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. బాలుడికి సురక్షితమైన, ప్రేమపూర్వకమైన కుటుంబ వాతావరణాన్ని కల్పిస్తూ, అతని భవిష్యత్తుకు అవసరమైన అవకాశాలను అందించాలని దత్తత తల్లిదండ్రులకు సూచించారు. దత్తత అనంతరం బాలుడికి కన్నబిడ్డతో సమానంగా అన్ని హక్కులు, బాధ్యతలు, కుటుంబ సౌకర్యాలు కల్పించబడతాయని అధికారులు తెలిపారు. దత్తత ప్రక్రియను సంబంధిత చట్టపరమైన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బాలల సంరక్షణ, రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అధికారులు తెలిపారు.



## రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతర వైద్య సేవలు

**రోగులకు సౌకర్యాల కల్పనపై ఆరా.. న్యూ జీజీహెచ్ లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆకస్మిక తనిఖీ**

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం రాత్రి న్యూ జీజీహెచ్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర చికిత్స విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది అందుబాటు, రోగులకు సౌకర్యాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్యం అందేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోగులు, వారి సహాయకులకు ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యంగా రోగులు, వారి బంధువులు వేచి ఉండే ప్రాంతాల్లో సీటింగ్ ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట అదనపు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, రోగులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## సర్‌పై నాలుగు రోజుల ప్రత్యేక ప్రచారం

**ఓటర్లకు సేవలందించేందుకు సమన్వయంతో కృషి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా జులై 31న ముసాయిదా జాబితా ప్రచురణ జరిగిందని.. అప్పటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ జరగనున్న నేపథ్యంలో ఈ నెల 22, 23, 29, 30 తేదీలను ప్రత్యేక ప్రచార దినాలుగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమం విజయవంతమయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు, బీఎల్‌వోలు చర్యలు తీసుకోవాలని, సమన్వయంతో పనిచేసి ఓటర్లకు సేవలందించాలని సూచించారు.

గురువారం సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) వివేక్ యాదవ్.. అన్ని జిల్లాల కలెక్టర్లతో సర్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జిల్లా అధికారులు హాజరయ్యారు. అక్టోబర్ 3వ తేదీన తుది జాబితా ప్రచురణ చేయాల్సి ఉన్నందున షెడ్యూల్ ప్రకారం అన్ని పనులను పూర్తిచేయాలని వివేక్ యాదవ్ సూచించారు. ఈ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నోటీసుల జారీ, ధ్రువపత్రాల పరిశీలన, విచారణ, తుది ఉత్తర్వుల జారీ తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి ప్రక్రియ సజావుగా జరిగేలా కృషిచేయాలన్నారు. ఫారం - 6, ఫారం - 7, ఫారం - 8ల పరిష్కారానికీ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక ప్రచార దినాల్లో బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ముసాయిదా జాబితాతో పాటు ఏఎస్‌డీడీ జాబితా, నోటీసులు జారీ అయిన వారి వివరాలు వంటివి అందుబాటులో ఉంచుకొని దరఖాస్తులు స్వీకరించడంతో పాటు సందేహాలు నివృత్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు 57 సీజనల్ హాస్టళ్ల మంజూరు

**నిర్వహణకు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలిలి**

**సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ ఆర్.రమేష్‌బాబు**

ఎన్‌టీఆర్ జిల్లాకు 57 సీజనల్ హాస్టళ్లు మంజూరయ్యాయని.. వీటి నిర్వహణకు గిరిజన, బీసీ, సాంఘిక సంక్షేమ శాఖలతో పాటు స్వయం సహాయక సంఘాలు, రిజిస్టర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) ఆర్.రమేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎ.కొండూరు, చందర్లపాడు, గంపలగూడెం, జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామ, పెనుగంచిప్రోలు, వత్సవాయి, వీరుళ్లపాడు, విజయవాడ రూరల్ మండలాల్లోని వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లల కోసం చదువు, భోజన వసతి కల్పించేందుకు ఈ హాస్టళ్లు మంజూరయ్యాయన్నారు. దరఖాస్తు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్ ద్వారా గుర్తింపు పొంది, మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన వారు డీఆర్‌డీఏ పీడీ అనుమతితో దరఖాస్తు చేసుకోవాలని, అదేవిధంగా అనుబంధ శాఖల వారు రాతపూర్వక దరఖాస్తులను ఈ-మెయిల్ లేదా లేఖద్వారా పంపాలని సూచించారు. ప్రతిపాదనలను ఈ నెల 24వ తేదీలోగా విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ (8712655816)ను సంప్రదించవచ్చని ఏపీసీ రమేష్‌బాబు సూచించారు.



# దక్షిణ మండలి సమావేశానికి చంద్రబాబు హాజరు

**మహాబలిపురంలో భేటీ ప్రారంభం**

**అమిత్ షా నేతృత్వంలో సమావేశం**

**దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై చర్చ**

**అభివృద్ధి, కేటాయింపులపై దృష్టి**

మహాబలిపురం, ఆగస్టు 20 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో తమిళనాడులోని మహాబలిపురంలో నిర్వహిస్తున్న 31వ దక్షిణ మండలి సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం, అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పలువురు ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పుదుచ్చేరి ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, కేంద్ర-రాష్ట్ర సంబంధాల బలోపేతం వంటి అంశాలు ప్రధాన చర్చాంశాలుగా నిలవనున్నాయి. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించి న పలు కీలక అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రవాణా అనుసంధానం, అంతర్రాష్ట్ర జల వనరుల వినియోగం, భద్రతా అంశాలు, పరిపాలనా సమన్వయం వంటి విషయాలపై విస్తృత చర్చ జరగనుంది. రాష్ట్రాలకు కేంద్రం నుంచి లభించాల్సిన నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులు, అభివృద్ధి కార్యక్రమాల అమలు పురోగతి వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రాధాన్యత పొందనున్నాయి. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది.

చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించే అవకాశముందని సమాచారం. ముఖ్యంగా రాష్ట్ర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రోత్సాహం, కేంద్ర సహకారం అవసరమైన కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉందని భావిస్తున్నారు. దక్షిణ మండలి సమావేశాలు రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంపొందించడంతో పాటు ప్రాంతీయ సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు కీలక వేదికగా నిలుస్తున్నాయి. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి, పరిపాలనా సమన్వయానికి దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీ కులగణనకు అన్ని పార్టీలు ముందుకు రావాలి

**బీసీల జనాభాకు ఖచ్చితమైన లెక్కలు అవసరం**

**సామాజిక న్యాయానికి కులగణన కీలకం**

**జనాభా ప్రాతిపదికనే హక్కులు, రిజర్వేషన్లు**

**మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్**



**హైదరాబాద్, ఆగస్టు 20 :**

దేశంలో బీసీల జనాభా భారీగా ఉన్నప్పటికీ వారి కులాల వారీగా ఖచ్చితమైన జనాభా లెక్కలు లేకపోవడం వల్ల రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం విషయంలో తీవ్ర అన్యా యం జరుగుతోందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనగణనలో ఓబీసీలకు జరుగు తున్న అన్యాయాలపై ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్, తెలంగాణ ఇంటలెక్చువల్స్ ఫోరం కన్వీనర్ చిరంజీవులు, మాజీ డీజీపీ పూర్ణచందర్ రావు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించా లంటే చట్టబద్ధమైన జనాభా లెక్కలు లేవంటూ పలు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు కులగణన చేపడతామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నప్పటికీ అమలులో మాత్రం జాప్యం జరుగుతోందని విమర్శించారు. బ్రిటిష్ పాలన కాలంలో 1881 నుంచి 1931 వరకు నిర్వహించిన జనగణనల్లో కులాల వివరాలు సేకరించారని, అప్పట్లో వేలాది బీసీ కులాలు గుర్తించబడినట్లు తెలిపారు. స్వాతం త్ర్యం తర్వాత కూడా బీసీల కులాల వారీ గణనకు తగిన ప్రాధా న్యం ఇవ్వలేదని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలకు కూడా కులాల వారీగా, కుటుంబాల వారీగా జనాభా లెక్కలు పారదర్శకంగా సేకరించాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాల్లో ఒకే కులానికి వేర్వేరు పేర్లు ఉండే పరిస్థితులను పరిగణ నలోకి తీసుకుని శాస్త్రీయ విధానంలో కులగణన నిర్వహించాలని సూచించారు. బీసీల కులగణన విషయంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు హక్కులు, రిజర్వేషన్లు కల్పించేందుకు ముందుకు వచ్చే పార్టీలకే బీసీల మద్దతు లభిస్తుందని స్పష్టం చేశారు. దేశంలో జంతువుల సంఖ్యకు కూడా లెక్కలు ఉన్నప్పటికీ బీసీల జనాభాపై ఖచ్చితమైన గణాంకా లు లేకపోవడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి ఎస్సై పట్టుబాటు

- **స్టేషన్ బెయిల్ కోసం రూ.30 వేలు డిమాండ్**
- **రాజంపేట ఎస్సైపై అవినీతి కేసు నమోదు**
- **ఇంట్లోనే లంచం తీసుకుంటూ పట్టుబాటు**

**కామారెడ్డి, ఆగస్టు 20 :**

స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు చార్జిషీట్‌లో తక్కువ శిక్ష పడే సెక్షన్లు నమోదు చేస్తానంటూ లంచం డిమాండ్ చేసిన ఎస్సై ఏసీబీ అధికారులకు చిక్కాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై దువ్వాల ఆంజనేయులు రూ.30 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారు లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సమాచారం ప్రకారం ఒక కేసులో నిందితుడిగా ఉన్న తన కుమారుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేయాలని బాధితుడు ఎస్సైను సంప్రదించాడు. అలాగే కేసులో తక్కువ శిక్ష పడే విధంగా సెక్షన్లు నమోదు చేయాలని కోరాడు. ఈ నేపథ్యంలో తన సహకారం అందించేం దుకు ఎస్సై రూ.30 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఎస్సై డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయిం చాడు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన అధికారు లు ప్రాథమిక విచారణ నిర్వహించి ఆరోపణల్లో నిజానిజాలను నిర్ధారించారు. అనంతరం ప్రత్యేక వ్యూహం రూపొందించి ఎస్సైని పట్టుకునేందుకు ఉచ్చుపన్నారు. ఏసీబీ సూచనల మేరకు బాధితుడు లంచం మొత్తాన్ని ఎస్సైకు అందజేయగా, గురువారం ఆయన స్వగృహంలోనే డబ్బు స్వీకరిస్తున్న సమయం లో అధికారులు దాడి నిర్వహించారు. లంచం తీసుకుంటున్న దశలోనే ఎస్సైను అదుపులోకి తీసుకు ని నగదు స్వాధీనం చేసుకున్నారు.



అనంతరం రసా యన పరీక్షలు నిర్వహించి ఆధారాలను సేకరిం చారు. ఈ ఘటనపై ఎస్సై దువ్వాల ఆంజనేయులుపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు వెల్ల డించారు. ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేసినా లేదా అక్రమా లకు పాల్పడినా వెంట నే ఏసీబీకి సమాచారం అందించాలని అధికా రులు ప్రజలకు సూచిం చారు. ఇందు కోసం టోల్ ఫ్రీ నంబర్ 1064తో పాటు వాట్సాప్ నంబర్ 9440 446106 అందు బాటులో ఉన్నాయని తెలి పారు. ప్రజల సహకారంతో అవినీతిని ని ర్మూలిం చేందుకు చర్య లు కొనసాగు తాయని ఏసీబీ పేర్కొంది.

## పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు
# ఊపందిస్తున్న విలీన వివాదం

**హైదరాబాద్, ఆగస్టు 20 :**



రాష్ట్రంలో పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ విశ్వవిద్యాలయంలో విలీనం చేసే ప్రతిపాదనపై విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నిర్ణ యం తమ విద్యా, ఉపాధి అవకాశాలపై ప్రతికూ ల ప్రభావం చూపుతుందని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన ఓ పాలిటె క్నిక్ విద్యార్థి మాట్లాడుతూ, తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని డిప్లొమా విద్యను ఎంచుకు న్నామ ని, ఈసెట్ ద్వారా ఇంజినీరింగ్‌లోకి వెళ్లాలనే లక్ష్యం తో చదువుతున్నామని తెలిపాడు. అయితే స్కిల్ విశ్వ విద్యాలయ విధానం కారణంగా తమ ఉన్నత విద్య అవకాశాలు దెబ్బతింటాయనే భయం నెలకొం దని పేర్కొన్నాడు. ప్రస్తుతం డిప్లొమా పూర్తి చేసిన వారికి ప్రైవేట్ ఉద్యోగాలే ఎక్కువగా లభిస్తున్నాయని, ప్రభు త్వ ఉద్యోగ అవకాశాలు పరిమితంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఫీజు రీయింబ ర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటి సదు పాయాలు కూడా సరిగా అందడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో కొత్త విధానా లు తమపై అదనపు భారంగా మారుతు న్నాయని అభిప్రాయపడ్డారు. ఆందోళన కార్యక్రమాల సంద ర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ నిరసన లను అణిచివేసే ప్రయత్నాలు జరుగుతు న్నాయని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యా ర్థులపై బలప్రయోగం జరిగిందని ఆరోపిం చారు. కొందరు విద్యార్థులు, మైనర్లపై కూడా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.



# విద్యా రంగంలో ఐదు కీలక బిల్లులు

**శాసనమండలిలో ఏకగ్రీవ ఆమోదం**

**మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన బిల్లులు**

**ఉన్నత విద్య, గ్రంథాలయ రంగాల్లో సంస్కరణలు**

**నైపుణ్య విశ్వవిద్యాలయాలకు మార్గం సుగమం**

అమరావతి, ఆగస్టు 20 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విద్యా రంగానికి సంబంధించిన ఐదు కీలక బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, సభ్యులందరి మద్దతుతో మండలి వాటిని ఆమోదించింది. విద్య, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సంస్కరణలను వేగవంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించినట్లు వెల్లడించింది. శాసనమండలి సమావేశంలో మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన బిల్లుల్లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు--2026 ఒకటి. రాష్ట్రంలోని గ్రంథాలయ వ్యవస్థను ఆధునికీకరించడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ బిల్లును తీసుకువచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**నారా లోకేశ్ ప్రవేశపెట్టిన బిల్లులు**

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లుకు కూడా మండలి ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యా సంస్థల పనితీరును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడం, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం ఈ సవరణల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వివరించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, రాష్ట్ర విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కేడర్‌లో రిజర్వేషన్‌కు సంబంధించిన సవరణ బిల్లులను కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ బిల్లుల ద్వారా విద్యా వ్యవస్థలో పారదర్శకత, సమాన అవకాశాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడింది.

రాష్ట్రంలో ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల ఏర్పాటు కోసం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించే సంస్థల ఏర్పాటుకు ఈ బిల్లు దోహదపడనుంది. సభలో ప్రవేశపెట్టిన ఐదు బిల్లులకు అన్ని రాజకీయ పక్షాల సభ్యులు మద్దతు తెలపడంతో అవి ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. విద్యా రంగంలో నాణ్యత పెంపు, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య విస్తరణ లక్ష్యాల సాధనలో ఈ బిల్లులు కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# కరీంనగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

**కరీంనగర్, ఆగస్టు 20 :**

కరీంనగర్ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. నగర అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 39వ డివిజన్ కోతిరాంపూర్ పరిధిలోని పోచమ్మవాడలో యూఐడీఎఫ్ నిధుల కింద రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ నిధులతో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఈ పనులు కీలకంగా నిలవనున్నాయి. అదేవిధంగా 54వ డివిజన్‌లో యూఐడీఎఫ్ నిధుల ద్వారా రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, వర్షపు నీటి పారుదల పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో ఆర్‌సీసీ డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే స్థానికంగా పారిశుద్ధ్య, రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు మాసం గణేష్, గొట్టిముక్కల ఉమారాణి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువు లో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టు సంస్థలకు సూచించారు. కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతోందని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

# బోడుప్పల్‌లో పౌర సమస్యలపై సమీక్ష

**మల్కాజిగిరి, ఆగస్టు 20 :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని న్యూ శ్రీ సాయినగర్ కాలనీని సందర్శించి స్థానిక పౌర సమస్యలను పరిశీలించారు. శ్రీ సాయినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కాలనీలో మంజూరైన రూ.96 కోట్ల విలువైన అభివృద్ధి పనులను వేగవంతంగా ప్రారంభించాలని కమిషనర్ ఆదేశించారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంలో జాప్యం చేస్తే తిరిగి టెండర్లు పిలిచి పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులో పూర్తి కావాలని స్పష్టం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, రహదారుల విస్తరణ, వాహనాల పార్కింగ్ సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెల్లార్ పార్కింగ్‌ను నిబంధనల ప్రకారం వినియోగించేలా చూడాలని, అనుమతి లేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీల సమస్య పరిష్కారానికి జలమండలితో సమన్వయం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. కాలనీలో దోమల నివారణ చర్యలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఫాగింగ్ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పచ్చదనం పెంపు కోసం మొక్కల సంరక్షణ, ప్లాంటర్ బాక్సుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు తెలిపారు. అవసరమైన చోట అడ్డంకులను తొలగించి కాలనీ అందాన్ని మెరుగుపరచాలని సూచించారు. వృద్ధుల కోసం ప్రత్యేక సదుపాయాల ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య సంస్థలు తమ వ్యాపార అనుమతులను సకాలంలో పునరుద్ధరించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ తెలిపారు. శాఖల మధ్య సమన్వయం, నిరంతర పర్యవేక్షణ, కాలపరిమితిలో సమస్యల పరిష్కారం ద్వారా ప్రజల సమస్యలను భూమి స్థాయిలో పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమని పేర్కొన్నారు.





# 22ఏ ఫిర్యాదులకు వేగవంత పరిష్కారం

**హైదరాబాద్, ఆగస్టు 20 :**

22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ శాఖ మరింత వేగంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులను అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించి, ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సమస్యలను వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. 22ఏ ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి కాల్ సెంటర్ పనితీరు, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార స్థితి, ఎక్కువగా వస్తున్న సమస్యలు తదితర అంశాలపై మంత్రి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశానికి సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 ఫిర్యాదులు కాల్ సెంటర్‌కు వచ్చినట్లు అధికారులు వివరించగా, ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పరిశీలించాలని మంత్రి సూచించారు.

కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ తదితర అధికారులకు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కారం అయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. సమస్యను కేవలం పరిపాలనా ప్రక్రియగా కాకుండా ప్రజల హక్కులకు సంబంధించిన అంశంగా భావించి పని చేయాలని సూచించారు. భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు చేరింది, దరఖాస్తుదారుడికి అర్హత ఉందా లేదా, ఫిర్యాదు వాస్తవమా కాదా అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన పత్రాలను పరిశీలించి, స్పష్టమైన కారణాలతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అన్యాయం జరగకుండా ప్రతి కేసును నిష్పక్షపాతంగా పరిశీలించాలని చెప్పారు. ఇప్పటికే వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు ఇటీవల కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా అత్యవసరంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఇకపై కొత్త దరఖాస్తులు పేరుకుపోకుండా సమయానుకూలంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయం పెంచి సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ప్రతి వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో వెళ్లేలా అధికారులు పనిచేయాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒక కార్యాలయం నుంచి మరొక కార్యాలయానికి పంపుతూ ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని హెచ్చరించారు. 22ఏ సమస్యను ప్రత్యేక బాధ్యతగా తీసుకుని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని మంత్రి ఆదేశించారు.

# దర్యాప్తు నాణ్యత పెంచాలి: ఎస్పీ శరత్ చంద్ర పవార్

- దేవరకొండ, దిండి పోలీసు కార్యాలయాల తనిఖీ
- పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారంపై ఆదేశాలు
- మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

**నల్గొండ, ఆగస్టు 20 :**

నల్గొండ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్ దేవరకొండ డీఎస్పీ కార్యాలయం, దిండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల్లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, నేరాల రికార్డులు, పరిపాలనా వ్యవహారాలను సమీక్షించారు. దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా సమర్థవంతమైన అభియోగాలను నమోదు చేయాలని సూచించారు. హత్యలు, దోపిడీలు, చోరీలు, మహిళలు మరియు చిన్నారులపై నేరాలు, ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల కేసులు వంటి తీవ్రమైన నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి కేసును నిష్పాక్షికంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నేర నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులపై వెంటనే స్పందించాలని, పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా పనిచేయాలని ఎస్పీ సూచించారు. రికార్డులను ఎప్పటి కప్పుడు నవీకరించడంతో పాటు విధుల్లో పారదర్శకత పాటించాలని చెప్పారు. ఈ తనిఖీల్లో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాస రావు, దిండి సీఐ బిసన్నతో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు.



# సచివాలయం వద్ద రాజీవ్‌కు ఘన నివాళి

**హైదరాబాద్, ఆగస్టు 20 :**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా హైదరాబాద్ సచివాలయం ఎదురుగా ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పగుచ్ఛాలు సమర్పించి నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్, లక్ష్మణ్ యాదవ్, రాపోలు జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ దేశంలో సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు భారతదేశాన్ని ఆధునిక దిశగా నడిపించాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత, స్థానిక సంస్థల బలోపేతం వంటి అంశాలకు రాజీవ్ గాంధీ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని నాయకులు గుర్తు చేశారు. భవిష్యత్ తరాల కోసం దూరదృష్టితో అనేక సంస్కరణలు చేపట్టిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. డిజిటల్ భారత్‌కు పునాదులు వేసిన నాయకుల్లో రాజీవ్ గాంధీ ఒకరని వక్తలు పేర్కొన్నారు. సమాచార విప్లవానికి ఆయన చేసిన కృషి దేశ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచిందని అన్నారు. దేశ పురోగతిలో ఆయన పాత్ర చిరస్మరణీయమని అభిప్రాయపడ్డారు. జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితమవ్వాలని నాయకులు పిలుపునిచ్చారు. దేశనిర్మాణంలో యువత ముందుండాలని, అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# గండిపేట వార్డులో కమిషనర్ పర్యటన

**హైదరాబాద్, ఆగస్టు 20 :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ 'ఒక రోజు--ఒక వార్డు' కార్యక్రమంలో భాగంగా గండిపేట వార్డును సందర్శించారు. ఖానాపూర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో స్థానిక ప్రజలు, నివాస సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. వార్డు పరిధిలోని పలు మౌలిక సదుపాయాల అంశాలపై ప్రజలు తమ వినతులను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. భూగర్భ మురుగునీటి వ్యవస్థ, మురుగునీటి పారుదల, తాగునీటి సరఫరా, రహదారుల పరిస్థితి, వర్షపు నీటి కాలువలు, చెరువుల సంరక్షణ వంటి అంశాలపై స్థానికులు సమస్యలను వివరించారు. పారిశుద్ధ్యం, దోమల నివారణ, వీధి కుక్కల సమస్యలు, వీధి దీపాల నిర్వహణ, సామాజిక మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావించారు. శ్మశానవాటిక అభివృద్ధి, పట్టణ ప్రణాళిక సమస్యలు, అనుమతి లేని నిర్మాణాలు, అక్రమ చెత్త పారవేత, విద్యా మౌలిక సదుపాయాల అవసరం, పింఛన్ల మంజూరు వంటి అంశాలపై కూడా ప్రజలు వినతులు సమర్పించారు. చాలా కాలంగా పరిష్కారం కాని సమస్యలను అధికారులు అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అంశాన్ని కమిషనర్ నిశితంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, ప్రాధాన్యత ఆధారంగా పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.

# గుంటూరుపల్లి అభివృద్ధికి ప్రత్యేక హామీలు

- ప్రజా పాలనలో వినతుల స్వీకరణ
- రహదారి నిర్మాణానికి రూ.3.5 కోట్లు
- గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

**హనుమకొండ, ఆగస్టు 20 :**

"పల్లె పల్లెకు పొన్నం అన్న -- పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ఎలా అమలవుతున్నాయనే అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన మంత్రి, ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల సమక్షంలోనే పరిశీలించారు. సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం జరగాలన్నదే ప్రజా పాలన కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి పలు కీలక హామీలు ఇచ్చిన మంత్రి, గుంటూరుపల్లి--కేశవాపూర్ రహదారి అభివృద్ధి పనులకు రూ.3.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించారు. గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, వీఓ భవనం నిర్మాణంతో పాటు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సుల ఏర్పాటు విషయాన్ని కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. జల సంరక్షణకు గ్రామస్థాయిలో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఫామ్ పాండ్లు నిర్మించుకోవాలని కోరారు. భూగర్భ జలాల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని, నీటి వనరుల సంరక్షణతో భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియను కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేకుండా అర్హులందరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గుంటూరుపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## పట్టణ ఆరోగ్య కేంద్రాలపై కలెక్టర్ తనిఖీ

**నాగర్‌కర్నూలు, ఆగస్టు 20 :**

నాగర్‌కర్నూలు పట్టణంలోని ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం పట్టణ, బస్తీ దవాఖానాలను సందర్శించారు. శ్రీనగర్ కాలనీ 18వ వార్డులోని అర్బన్ దవాఖానాతో పాటు దేశిటిక్యాల 3వ వార్డులోని బస్తీ దవాఖానను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. తనిఖీల సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా, రోగులకు అవసరమైన సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశాలపై దృష్టి సారించారు. ప్రజలు ఆసుపత్రికి వచ్చిన వెంటనే అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందుల నిల్వలను కూడా కలెక్టర్ పరిశీలించారు. రోగులకు అవసరమైన ఔషధాలు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వివిధ వ్యాధుల నిర్ధారణకు అవసరమైన పరీక్షా సదుపాయాలు, వైద్య పరికరాల పనితీరుపై కూడా ఆరా తీశారు. అవసరమైన చోట వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## పట్వారిగూడెం పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 20 :**

దమ్మపేట మండలం పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలు, రోగుల నమోదు పుస్తకాలు, సిబ్బంది హాజరు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై సమగ్రంగా పరిశీలించారు. రక్త పరీక్షల విభాగాన్ని తనిఖీ చేసిన సందర్భంగా సుమారు రూ.3 లక్షల విలువైన అనాలసిస్ యంత్రం ఏడాదిగా పనిచేయడం లేదని కలెక్టర్ గుర్తించారు. ప్రజలకు అత్యవ సర వైద్య సేవల కోసం ఏర్పాటు చేసిన పరికరం ఇంతకాలం వినియోగంలో లేకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యంత్రం పనిచేయకపోవడానికి గల కారణాలను సంబంధి త సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ అంశంపై జిల్లా వైద్యాధి కారిని ఫోన్‌లో సంప్రదించిన కలెక్టర్ అంకిత్, పరికరాల నిర్వహ ణలో జరిగిన జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య సేవలకు సంబం ధించిన కీలక పరికరాలు పనిచేయకపోతే వెంటనే స్పందించి మర మ్మతులు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

**ఆసిఫాబాద్, ఆగస్టు 20 :**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 2026 ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పౌరసరఫరాలు, వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, తూనికలు కొలతలు, సెర్ప్ శాఖల అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు ఏర్పాట్ల పురోగతిని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 23 వేల 934 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చే అవకాశముందని అధికారులు సమావేశంలో వివరించారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య, వాటి స్థానం, అవసరమైన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు.




ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల కోసం ఎంపిక చేసే ప్రదేశాలు ఎత్తైన ప్రాంతాల్లో ఉండాలని, వర్షాల సమయంలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అలాగే లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభంగా చేరుకునే ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా కేంద్రాలకు తీసుకురాగల విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు, టార్పాలిన్ కవర్లు వంటి మౌలిక సదుపాయాలు ముందుగానే అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైన పరికరాల కోసం ప్రభుత్వానికి వెంటనే ఇండెంట్ సమర్పించి సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు సమయంలో సాంకేతిక లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, సమాచారం అందించే ఏర్పాట్లు కూడా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన, చెల్లింపుల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ రాజస్వ మండల అధికారి చెన్నూరి కిష్టయ్యతో పాటు పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, మార్కెటింగ్ శాఖ, సహకార శాఖ, ఐకేపీ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# శక్తి పథకం రద్దు డిమాండ్‌తో ఆందోళన



**వరంగల్, ఆగస్టు 20 :**

వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు జి.ఓ. 97 ద్వారా అమలులో ఉన్న శక్తి పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళన కార్యక్రమం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. విద్యార్థులు తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కళాశాల ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ నిరసనకు మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ సంఘీభావం ప్రకటించి విద్యార్థులకు మద్దతు తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారి డిమాండ్లు న్యాయమైనవేనని పేర్కొన్నారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న దాస్యం వినయ్ భాస్కర్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి ములుగు రోడ్ జంక్షన్ వరకు భారీగా ర్యాలీ చేపట్టి అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శక్తి పథకం తమ విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జి.ఓ. 97ను పునఃసమీక్షించాలని కోరారు. శక్తి పథకం అమలు వల్ల తలెత్తుతున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల అభిప్రాయాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. యువత భవిష్యత్తు, సాంకేతిక విద్యాభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం సానుకూల వైఖరితో ముందుకు రావాలని అన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అవసరమైతే ఈ అంశంపై మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. రాస్తారోకో కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు దాస్యం వినయ్ భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని మట్టేవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై ఆయనను విడుదల చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆందోళన కార్యక్రమం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో వరంగల్‌లో జరిగిన ఈ నిరసన కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలగకుండా తగిన నిర్ణయం తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలు కూడా ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

## నల్గొండ పార్లమెంట్ పరిధిలో బీఎల్‌ఏ సమీక్ష

**నల్గొండ, ఆగస్టు 20 :**

నల్గొండ పార్లమెంట్ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్‌ఏల సమీక్షా సమావేశాలు నిర్వహించారు. హాలియా, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో జరిగిన సమావేశాలకు నల్గొండ పార్లమెంట్ ఇన్‌చార్జి, తెలంగాణ ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, బీఎల్‌ఏ కోఆర్డినేటర్లు, ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశాల్లో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంపై సమావేశాల్లో విస్తృతంగా చర్చించారు. ఓటర్ల జాబితా పరిశీలన, అర్హులైన ఓటర్ల నమోదు, ఓటర్లకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం వంటి అంశాలపై నాయకులు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షించబడేలా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

**ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబం ధించిన సమాచారాన్ని ఇంటింటికీ చేరవేసి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే దిశగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదులో ఎలాంటి పొరపా ట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.**

ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింత బలోపేతం కావడానికి కృషి చేయాలని సూచించారు. సమీక్షా సమావేశాల అనంతరం నల్గొండ పార్లమెంట్ పరిధిలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హాలియా, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



# కళ్యాణలక్ష్మి, నిలిపివేతపై బీఆర్ఎస్ ఆందోళన

**, ఆగస్టు 20 :**

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో జాప్యం జరుగుతోందంటూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించే ఈ రెండు పథకాలు వేలాది కుటుంబాలకు అండగా నిలిచాయని, వాటి అమలులో నిర్లక్ష్యం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని నాయకులు ఆరోపించారు. ఆందోళనలో పాల్గొన్న మహిళలు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.




ప్రభుత్వం వెంటనే పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయ కులు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు సామాజిక భద్రతకు ప్రతీకగా నిలిచాయని చెప్పారు. పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషించాయని, ప్రస్తుతం వాటి అమలులో ఏర్పడిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని సూచించారు. పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. పేద కుటుంబాల ప్రయోజనాలను కాపాడేందుకు పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని ముగించారు.

# జానపద నృత్యంతో మాధురి రాథోడ్‌కు భారీ క్రేజ్!



**హైదరాబాద్, ఆగస్టు 20 :**

జానపద నృత్యాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాధురి రాథోడ్ సామాజిక మాధ్యమాల్లో దూసుకుపోతున్నారు. ఆమె చేసిన పాటల నృత్య వీడియోలు భారీగా వైరల్ అవుతూ లక్షలాది వీక్షణలను సొంతం చేసుకుంటున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన బాల్యం, నృత్యంపై ఉన్న ఆసక్తి, సామాజిక మాధ్యమాల్లో తన ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

**టీవీలో చూసి.. నృత్యం నేర్చుకుంది**

మాధురి ఏడుగురు తోబుట్టువుల్లో ఐదో సంతానం. తన తల్లి ముగ్గురు సోదరీమణులను నృత్య తరగతులకు పంపినప్పటికీ, తనకు ఆ అవకాశం దక్కలేదని ఆమె తెలిపారు. అయినప్పటికీ నృత్యంపై ఉన్న మక్కువతో వెనక్కి తగ్గలేదని చెప్పారు. టీవీలో హీరోహీరోయిన్లను చూసి వారి నృత్య కదలికలను అనుకరిస్తూ, హావభావాలను సాధన చేస్తూ స్వయంగా నృత్యం నేర్చుకున్నానని వెల్లడించారు.

**కళాశాల నుంచే సామాజిక మాధ్యమాల్లోకి..**

బీటెక్ చివరి ఏడాదిలో మాధురి సామాజిక మాధ్యమాల్లో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. కళాశాల కార్యక్రమాల్లో ఆమె నృత్యం చూసిన స్నేహితులు టిక్‌టాక్‌లో వీడియోలు చేయాలని సూచించారట. తొలుత సంభాషణలతో వీడియోలు చేసిన ఆమె.. ఓ రోజు జానపద పాటకు నృత్యం చేసి వీడియో పెట్టగా అది విపరీతంగా వైరల్ అయింది. దీంతో ఆమెకు జానపద నృత్యకారిణిగా ప్రత్యేక గుర్తింపు వచ్చింది. పాత పాటలతో సరికొత్త గుర్తింపు టిక్‌టాక్ నిషేధం తర్వాత మాధురి సామాజిక మాధ్యమా ల్లో మరో వేదికకు మారారు.

# అల్లరి నరేష్ సినిమా నుంచి కొత్త పాట

**హైదరాబాద్, ఆగస్టు 20 :**

**కామెడీ చిత్రాల కథానాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్న అల్లరి నరేష్ మరోసారి ప్రేక్షకులను నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వినోదాత్మక చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ సినిమా సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా చిత్రబృందం తాజాగా రెండో పాటను విడుదల చేసింది.**

'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పాటలోని 'వెళ్లవే పేదరికం.. ఇక్కడే ఇల్లరికం' అంటూ సాగే సాహిత్యం ఆకట్టుకుంటోంది. సినిమా కథలోని హాస్యభరిత పరిస్థితులకు ఈ పాట అద్దం పడుతున్నట్లు కనిపిస్తోంది. చంద్రమోహన్ చింతా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అల్లరి నరేష్ తనదైన హాస్యంతో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ సినిమాలో అల్లరి నరేష్‌కు జోడీగా సురభి నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య సన్నివేశాలు, హాస్యభరిత అంశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవ నున్నాయి. కుటుంబ ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని రూపొందించినట్లు చిత్రబృందం చెబుతోంది. వరుస చిత్రాలతో బిజీగా ఉన్న అల్లరి నరేష్ ఈ సినిమాతో ఎలాం టి విజయాన్ని అందుకుంటారో చూడాలి.




# బెట్టింగ్ యాప్స్ కేసులో నిధి అగర్వాల్‌కు ఈడీ ప్రశ్నలు



**హైదరాబాద్, ఆగస్టు 20 ::**

బెట్టింగ్ యాప్స్ ప్రచారంతో వార్తల్లో నిలిచిన నటి నిధి అగర్వాల్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజర య్యారు. నిషేధి త బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌కు సంబంధిం చిన వ్యవహారంలో ఆమెను అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు సమాచారం. ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్ వివరాలు, వాటితో చేసుకున్న ప్రచార ఒప్పందాలు, అందుకు న్న పారితోషికంపై అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఆయా యాప్స్ నిర్వాహకుల నుంచి నిధి అగర్వాల్ ఖాతాల కు బదిలీ అయిన నగదు వివరాలపైనా ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలపై ఆరా బెట్టింగ్ యాప్స్ ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలు, మనీలాం డరింగ్ కోణంలోనూ ఈడీ అధికారులు వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఓ నిర్మాణ సంస్థ తో నిధికి ఉన్న ఆర్థిక సంబంధాలు, సంబం ధిత ప్రాజెక్టుల ద్వారా అందుకున్న పారితోషి కంపైనా విచారణలో ప్రశ్నలు వేసినట్లు సమాచా రం. పలువురు సినీ ప్రముఖుల విచారణ నిషేధిత బెట్టింగ్ యాప్స్ ప్రచారానికి సంబంధించి ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ఈడీ అధికారులు విచారించి నట్లు సమాచారం. నటులు ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, రానా, మంచు లక్ష్మి లను కూడా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో మరికొందరికి కూడా నోటీ సులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమా చారం. పోలీ సుల కేసు ఆధారంగా ఈడీ దర్యాప్తు నిషేధిత బెట్టింగ్ యాప్స్‌కు సామా జిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పిస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలపై సైబరా బాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకేసు ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ డీ దర్యాప్తు కొనసాగి స్తోంది. సెలబ్రి టీలు అందుకున్న పారితోషికాలు, వారి ఖాతాల్లో జరిగిన ఆర్థిక లావాదేవీలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

# ఓటీటీలో దూసుకుపోతున్న పాంచాలి .. ఐదుగురు భర్తల కథ!

**హైదరాబాద్, ఆగస్టు 20 ::**



ఓటీటీల్లో ప్రతి వారం కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. థియేటర్లలో విడుదలైన కొద్ది వారాలకే సినిమాలు ఓటీటీలోకి వస్తుండటంతో ఇంటి నుంచే సినిమాలు చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఓ రొమాంటిక్ డ్రామా సిరీస్ ప్రస్తుతం ఓటీటీలో మంచి ఆదరణ పొందుతోంది. అదే 'పాంచాలి'. ద్రౌపతి కథ ఆధారంగా. మహాభారతంలోని ద్రౌపతి పాత్ర స్ఫూర్తితో ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. 2019లో విడుదలైన ఈ తమిళ సిరీస్‌లో నటి అనుప్రియ గోయెంకా ప్రధాన పాత్రలో నటిం చారు. ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం ఈ సిరీస్ అల్ట్రా ప్లేలో స్ట్రీమింగ్ అవుతుండగా, ప్రైమ్ వీడియోలోనూ అందుబాటులో ఉంది. తమిళంతో పాటు తెలుగు భాషలోనూ వీక్షించ వచ్చు. ఐదుగురు అన్నదమ్ములు.. ఒకే భార్య కథ విషయానికి వస్తే.. నలుగురు అన్నద మ్ములు భూమి అనే యువతిని వివాహం చేసుకుంటారు. నగరం లో నివసించే తమ తమ్ముడు కూడా ఆమెనే పెళ్లి చేసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతా రు. అయితే అతడు అందుకు అంగీకరిం చడు. ఆ తర్వాత కుటుంబంలో అనూహ్య పరిణామాలు చోటుచేసు కుంటాయి. దేవుడి విగ్రహం నుంచి రక్తం! ఒకరోజు ఇంట్లోని పూజ గదిలో దేవుడి విగ్రహం నుంచి రక్తం రావడం తో కుటుం బ సభ్యులు షాక్‌కు గురవు తారు. తమ తమ్ముడు భూమిని పెళ్లి చేసుకోకపోవడం వల్లే ఈ పరిణామం జరిగిందని వారు భావిస్తారు.



# రూ.4 కోట్ల వసూళ్లు దాటిన హుషారు పిట్టలు

**హైదరాబాద్, ఆగస్టు 20 ::**

కథ బలంగా ఉంటే చిన్న సినిమా అయినా పెద్ద విజయాన్ని సాధిస్తుందనే మాటను 'హుషారు పిట్టలు' మరోసారి నిజం చేసింది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా, కొత్త నటీనటులతో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన తర్వాత సానుకూల స్పందన రావడంతో వసూళ్లు క్రమంగా పెరుగుతున్నాయి.

**భారీ తారాగణం లేకపోయినా సహజమైన కథాకథనాలు, నటీనటుల సహజ నటన, ప్రేక్షకుల నుంచి వచ్చిన సానుకూల ప్రచారం సినిమాకు బలంగా మారాయి. ఇప్పటికే ఈ చిత్రం రూ.4 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా వసూళ్లలో స్థిరత్వం కొనసాగుతుండటంతో సినిమా లాభాల బాటలో పయనిస్తోంది.**

మంచి కథ, చక్కటి కథనం ఉంటే ప్రేక్షకులు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా సినిమాలను ఆదరిస్తారని 'హుషారు పిట్టలు' మరోసారి నిరూపించింది. ఈ ఏడాది టాలీవుడ్‌లో అంచనాలను తలకిందులు చేసిన విజయవం తమైన చిన్న చిత్రాల జాబితాలో ఇది చేరింది. చిన్న సినిమాలకు లభిస్తున్న ఈ ఆదరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలు తెరపైకి వచ్చే అవకాశం ఉంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467